
# విశ్వజ్ఞానయజ్ఞం – 2021

# మహాత్ములు నేటి తరానికి మార్గదర్శకులు

## విశ్వజ్ఞానయజ్ఞం - బృందావన యోగులు రెండవ రోజు (7/4/2021)




శివాయగురవేనమః

శ్రీమాత్రేనమః

శ్రీవిష్ణురూపాయనమః

శ్రీకృష్ణ: శరణం మమ

శ్రీరాధాకృష్ణాభ్యాం నమః



వైదగ్ధ్యసింధురనురాగరసైకసింధు:

లావణ్యసింధురమృతచ్ఛవిరూప సింధు:

వాత్సల్య సింధురతిసాంద్రకృపైకసింధు:

శ్రీరాధికా స్ఫురతుమే హృది కేళి సింధు

నిన్నటి స్మరణ: రాధాకృష్ణ తత్త్వాన్ని, బృందావన మహాత్మ్యాన్ని తెలుసుకున్నాం పరిచయమాత్రంగా! అక్కడ బృందావన యోగుల సిద్ధాంతం పేరు రస సిద్ధాంతం. మాములుగా సాహిత్యాల్లో సంగీతాల్లో చెప్పే రసము కాదు! రసము అంటే బ్రహ్మానందం, కృష్ణానుభూతి అనే రసము. అది ప్రేమ స్వరూపం, ఆనంద స్వరూపం, మహాభావ స్వరూపము! ఆ స్వరూపముల కలియకయే రాధాదేవి!

బృందావన యోగులలో జీవ గోస్వామి అనే మహానుభావుడు అంటారు:

*అనారాధ్య రాధా పదాంభోజ రేణుమ్*
*అనాశ్రిత్య బృందావనం తత్పదాంకం*
*అసంభాష్య తద్భావ గంభీర చింతాన్*
*కుత శ్యామసింధో: రసస్యావగాహ:*

శ్యామసింధువు అనగా నీలిసముద్రం అయిన రససముద్రం అయినటువంటి కృష్ణసముద్రం! ఆయనలో కలిసిపోవడం, కరిగిపోవడము, లయమవడమే జీవన లక్ష్యం! ఆ సింధువులో దిగాలంటే మూడు అర్హతలు: 1) రాధాదేవి యొక్క పదాంభోజరేణువుని ఆశ్రయించాలి ఆరాధించాలి, అది లేనివాడికి కృష్ణతత్త్వం దొరకదు 2) బృందావనాన్ని ఆశ్రయించి తీరాలి! 3) రాధాకృష్ణ ఉపాసన చేస్తున్న సత్పురుషులతో సత్సాంగత్యం! ఏ సత్పురుషుల వల్ల కృష్ణతత్త్వ, లీలా, వైభవం వృద్ధి చెందుతాయో, ఎవరు వాటినే భావిస్తూ ఉంటారో ఆ సత్పురుషులని ఆశ్రయించాలి!

బృందావనాన్ని ఆశ్రయించి రస్ ఖాన్ - రాధాకృష్ణ ఉపాసకుడు, ఆయన సాహిత్యం కూడా లభ్యం అవుతున్నది, రెహెమాన్ అనే కుర్రవాడు కూడా ఆవిధంగానే సిద్ధి పొందాడు, గులాబ్ బాబా అనే ముస్లిం కూడా రాధా సాక్షాత్కారం పొందాడు!
విశ్వజనని అయినటువంటి రాధాదేవి, విశ్వనాయకుడైన కృష్ణుడు ఎవరి వారు కారు?

రస్ ఖాన్ అంటారు, నువ్వు మళ్ళీ మనుష్య జన్మ పొందాలి అనుకుంటే ఒక గోపకుడిగా పుట్టు, పశువుగా పుట్టాలి అంటే కృష్ణపరమాత్మ తోలే ఆవుగా పుట్టు, రాయిగా పుట్టాలి అంటే కృష్ణపరమాత్మ ఇంద్రుని గర్వాన్ని అణచడానికి ఎత్తిన గోవర్ధన గిరిలో రాయిగా పుట్టు, పక్షిగా పుట్టాలి అంటే స్వామి ఎక్కిన కదంబ వృక్షంపై కూర్చుని కూసే పక్షిలా పుట్టు! అన్నారు. బృందావన జన్మ కావాలని కోరుకుంటున్నారు.

బృందావనం చుట్టూ పన్నెండు వనాలు ఉంటాయి! ఇదంతా కలిపి గోలోకం అంటారు! బ్రహ్మాండాలకు ఆవల ఉన్న గోలోక విభూతి ఇక్కడ ఉన్నది. మన క్షేత్రాల్లో ప్రత్యేకత దివ్యలోకాల విభూతులు ఉండడం! దానివల్ల క్షేత్రాలని ఆశ్రయిస్తే ఆ దివ్యలోకాలతో అనుసంధానం ఏర్పడుతుంది!

బృందావనంలో పన్నెండు వనాల గురించి పద్మపురాణం చెప్తున్నది. యమునానదికి పడమర ఏడు వనాలు ఉన్నాయి. మధు, తాళ, కుముద, బహుళ, కామ్య, ఖదిర, బృందావనాలు. తూర్పువైపున శ్రీభద్ర, బాండీర, బిల్వ, లౌహ, మహావనాలు. బిల్వవనంలో మహాలక్ష్మీదేవి నేటికీ కూడా తపస్సు ఆచరిస్తూ ఉంటుందిట! బృందావనం సర్వదేవతల నిలయం.
నారదులవారు ఒకమారు ఆ వనాల్లో సంచరిస్తూ ఉంటే బ్రహ్మవిద్యా దేవత తపస్సు చేస్తూ కనపడిందిట! ఏమిటమ్మా అంటే కృష్ణారసంలో లీనమవడానికి తపస్సు చేస్తున్నాను అందిట! బ్రహ్మవిద్య లక్ష్యం అదే కదా! వనముల బృందం అంతా కలిపి బృందావనం. ఈ బృందావనంలో నందగోకులం, బర్సానా ప్రధాన క్షేత్రాలు. మూడవది గోవర్ధనగిరి! ఈ గిరి పరిక్రమ రాధాకృష్ణుల ప్రీతిపాత్రం! రాధా కుండ్, శ్యామ్ కుండ్ అనే కుండములలో స్నానం ఆచరించి గిరిపరిక్రమ చేయడం ఒక ప్రక్రియ! ఇది చేసేటప్పుడు శుద్ధమైన మనస్సుతో ఆ రససిద్ధాంతాన్ని మనస్సులో పెట్టుకుని చేయాలి! అప్పుడు రాధాకృష్ణ కృప తప్పక లభిస్తుంది.
ఈ గోవర్ధనగిరి పరిసర ప్రాంతాల్లో ఎంతోమంది యోగులు చిన్న చిన్న కుటీరాలు ఏర్పర్చుకుని నిరాడంబర జీవితం గడుపుతూ, అద్భుత శక్తులు కలిగి కూడా సామాన్యుల వలె ఉన్న యోగులు ఎందరో ఉన్నారు!

<u>ప్రబోధానంద సరస్వతి</u>
సన్యాసి, మహాపండితుడు! కాశీక్షేత్రంలో 10,000 శిష్యులతో ఉండేవాడు! అద్వైత సిద్ధాంతంలో ఘటికుడు! చైతన్యమహాప్రభువుతో సంభాషణ వల్ల ఆయనలో పరివర్తన జరిగి, తాను ఏ అద్వైతసిద్ధాంతాన్ని బోధిస్తున్నాడో, దానికి కృష్ణారసానికి ఏమీ భేదం లేదని తెలుసుకుని, కృష్ణారస పానం చేయడానికి బృందావనం చేరుకున్నాడు! అటుపై అక్కడున్న మహాత్ములవద్దకు వెళ్లి రాధాకృష్ణ లీలలు తెలుసుకుని అవి చింతన చేస్తూ, ఆయనకున్న మంత్రాలు చేస్తూ ఉన్నాడు! అయితే ఆ దివ్య రసానుభూతి రాలేదని బాధ పడుతూ ఉన్నాడు! అదే సమయంలో పరమానంద దాస్ జి అనే మహానుభావుడు ఉండేవాడు (ఈయన సింధు దేశపు రాజు అన్నీ వదిలివేసి బృందావనం చేరుకున్న యోగి), ఈ ప్రబోధానంద సరస్వతి ఆయన వద్ద ఉంటూ ఎక్కడెక్కడ దివ్యధామములు ఉన్నాయో తెలుసుకున్నాడు.

బృందావనంలో దివ్యధామములు

మాన్ సరోవర్ ప్రాంతం వద్ద రాధాకృష్ణుల నిత్యవిహార లీల జరుగుతూ ఉంటుంది. అసలు బృందావనం అంతా నిత్యలీలావిహార భూమియే! అయితే కొన్ని దివ్యభూమికలు యోగులు చెప్తూ ఉంటారు, వంశీవట్, నిధివన్, సేవాకుంజ్, తటియాస్థల్ మొదలైనవి!
ఈ మాన్ సరోవర్ వద్దనే నారదమహర్షి తపస్సు చేసి నారదాభక్తిసూత్రాలు రచించారు! "యథా వ్రజగోపికానాం" అని "సాత్వస్మిన్ పరమప్రేమరూపా" అని నిర్వచనం ఇచ్చినది ఇక్కడే! బృందావనంలో ఉంది సాధన చేస్తే "సాత్వస్మిన్ పరమప్రేమరూపా" అనేది అనుభవానికి వస్తుంది!
అందుకు ఈ భక్తి సూత్రాలు అర్థం కావాలంటే బృందావనం రసం తెలియాలి! భక్తియే పరమావధి ఎప్పుడు అవుతుంది అంటే రసభక్తి అయినప్పుడు! విషయముల మీద పూర్తి విముఖత కలిగినవారు, రాగద్వేషాలు రెండిటికి లొంగనివారు మాత్రమే కృష్ణరసాన్ని ఆస్వాదించగలరు! అటువంటిది శుద్ధప్రేమ భక్తి. అది నారదులవారు అనుభవానికి తెచ్చుకుని రచించినవే నారదభక్తిసూత్రాలు.

ప్రబోధానంద సరస్వతి మొదట పేరు ప్రకాశానంద సరస్వతి. ఆయన ఒకనాడు ఆ మాన్ సరోవర్ వద్ద ఉండిపోయాడు ఒక మారు నిత్యలీలలు చూడాలనుకుని! అది నిర్జన ప్రాంతం!
ఇదంతా 16-17వ శతాబ్ద ప్రాంతంలో జరిగింది. హితహరివంశీ, చైతన్యమహాప్రభు, హరిదాస్ జి వీరంతా సమకాలికులు! వీరంతా రాకపోయి ఉంటే మన సనాతనధర్మం ఈ పాటి కూడా మిగిలేది కాదు!
మొత్తానికి ప్రకాశానంద సరస్వతి స్వామి అక్కడ ఉన్నారు ఆ నాడు! ఒక్కసారి చీకటి అవుతున్నకొద్దీ భయంకరమైన సింహాలు కొట్టుకుంటూ కనపడ్డాయి, సర్పాలు కనపడ్డాయి, ఏదేమయినా నిశ్చలంగా ఉన్నాడు! భయంకరమైన గాలులు వీచాయి అయినా నిశ్చలంగా ఉన్నాడు. కాసేపటికి ప్రశాంతమైన వాయుతరంగాలు వచ్చాయి, ఆయనకి నిద్రపట్టినట్లు అయిపోయింది, అప్పుడు ఒక ఇద్దరు వచ్చారు పరివారంతో, ఈయనకు ఇంకా లీలలు దర్శించడానికి అర్హత రాలేదని మధురలో ఆయన కుటీరంలో పెట్టేసారు! ఆయన మేల్కొని రసగ్రహణకి ఇంకా అర్హత లేదని అర్థం చేస్కుని పరమానంద దాస్ జి కి చెప్పారు! ఆయన హితహరివంశీ ని ఆశ్రయించమని చెప్పారు!

ప్రకాశానంద సరస్వతి హితహరివంశీ ని ఆశ్రయించారు! హితహరివంశీ నిత్యవిహార దీక్షని కొన్ని పరీక్షలు అయ్యాక ఇచ్చారు! ఎన్ని విధానాలు ఉన్నాయో! మనః సంస్కారాలు ఏర్పరుచుకోవాలి, కొన్ని పాటించాలి, గురుశిక్షణ చాలా అవసరం! మొత్తానికి ఈయన గురుశిక్షణలో సాధన చేసి మాన్ సరోవర్ లో ఆ సరస్సులో రాధాకృష్ణులు దివ్యమైన సఖీ గణముతో తానాలు ఆడుతూ ఉండడం చూడగలిగారు! ఆ తర్వాత ఈయన

బృందావనంలో సంచరించి, బృందావన రసాన్ని ఆస్వాదించి "బృందావన మహిమామృతం" అని సంస్కృత శ్లోకాలతో రచించారు! రసరమ్యమైన శ్లోకాలు ఇందులో ఉన్నాయి! గొప్ప కావ్యంలా రచించారు!

#సమస్త జగాలని మోహింప చేయాలంటే బృందావన వృక్షాల్లో ఒక చిగురు చాలు అలాంటిది బృందాచంద్రుడు అయిన కృష్ణపరమాత్మ గురించి రాధాదేవి గురించి ఏమి చెప్పగలము?

#బృందావనాన్ని రాధికావనం అని కూడా అంటారు! సాధకుడికి చెప్తున్నారు, విషమని తెలిసాక ఆ వస్తువుని ఎలా వదిలిపెడతావో అలా విషయాలని విడిచిపెట్టి, జన్మరాహిత్యం ఇచ్చేటువంటి, సమస్త పురుషార్థాలకు సారమైన రసాన్ని పొందడానికి రాధికావనం అయిన బృందావనాన్ని ఆశ్రయించు!

# అనిర్వచనీయమైన అనురాగ రసానికి ఘని బృందావనం!

అద్వైత సిద్ధిని పొందినవారెందరో కృష్ణభక్తులు అయ్యారు నారాయణతీర్థులు, ఆదిశంకరులు, మధుసూదన సరస్వతి, అంతెందుకు శుకమహర్షియే ఉన్నారు కదా!

ఉపనిషత్ ప్రతిపాద్యమైన బ్రహ్మమే రాధాకృష్ణతత్త్వం అని ప్రతిపాదించారు నారాయణతీర్థులు!

# అనిర్వచనీయమైన అనురాగ రసానికి ఘని బృందావనం!

# ఈ గురువులని ఆ గురువులని ఆశ్రయించి ఏదో సంపాదించాలని దేవుళ్ళాడడం ఎందుకు? కొంతకాలం లోకం ఏమనుకుంటుందో అని ప్రవర్తించడం, అపకీర్తి కలుగుతుంది ఏమో అని కొంతకాలం, ధర్మాధర్మాల విషయాల్లో మీమాంసాలు కొంతకాలం, రకరకాల పుస్తకాలు చదవడం కొంతకాలం! ఎందుకయ్యా ఇవన్నీ! నాకవన్నీ పనిలేదు! నాలో బృందావన రసం ప్రవేశించింది!

వ్యర్థ విషయములతో కాలాన్ని వ్యర్థపరచుకోకుండా రసరూపుడైన కృష్ణపరమాత్మని ఆశ్రయించి, రసధామమైన బృందావనాన్ని చేరుకోవాలి!

#రకరకాల శాస్త్రాలు ఎందుకు? ఏది పట్టుకున్నా రాధమ్మ ఉందా అని చూడు! ఆవిడ ఉంటేనే పట్టుకో! శాస్త్రాల్లో ప్రేమరూపిణి అయినటువంటి రాధాదేవి ఉన్నదో అదే తీస్కో! రాధాకృష్ణులు లేని చోటు ఏదీ వద్దు! వారిద్దరూ ఉన్న బృందావనం మాకు చాలు!

# ఆ బృందావనంలో ఇద్దరు తిరుగుతున్నారు, ఒకరు నీలిరంగు, ఒకరు బంగారురంగు! బంగారురంగు అమ్మ రాధమ్మ, నీలిరంగు కృష్ణపరమాత్మ! కిశోర రూపంలో తిరుగుతూ ఉంటారు! యుగళకిశోరం ఆడుకుంటూ ఉండగా ఎందరో చూశారట! ఒకరిని ఒకరు చూసుకుంటున్నారు ఆనందంగా, ఒకరి ముఖం చంద్రుడు అయితే మరొకరు చకోరంలా మారి ఇద్దరూ పరస్పరం వారి వదనాల యొక్క సౌందర్యం ఆస్వాదిస్తూ బృందావన కాననంలో తిరుగుతుంటారు ఆ చిత్తచోరులు! వారి కోసం వెతుకుతూ ఉంటాము, అటువంటప్పుడు మాకు ఈ ఘోరమైన సంసారం పట్ల ఎందుకు ఆసక్తి ఉంటుంది!

కిశోర రూపంలో వారిరువురినీ ధ్యానించాలి! దేవీభాగవతంలో అమ్మ రాధాదేవిని 12 ఏళ్ల ప్రాయంగా చెప్పారు. అమ్మవారు 9 ఏళ్ల బాలికగా ఎందరికో దర్శనం ఇచ్చింది. కృష్ణపరమాత్మ కూడా అదే వయసులో, అలా వారిద్దరూ ఆడుకోవడం ఎందరోచూసారు !

# జయతి జయతి రాధా ప్రేమసారైక గాథా

జయతి జయతి కృష్ణస్తథారసాపాన తృష్ణ:

జయతి జయతి బృందాసత్సాఖీనాంద్వయఖ్యం

జయతి జయతి బృందా కాననం తత్స్వధామమ్

రాధా ప్రేమసారైక గాథా - ప్రేమయొక్క సారమే తన గాథగా ఉన్న తల్లి, ఆ రాధారసం పట్ల దాహంతో ఉన్న కృష్ణపరమాత్మ, వారిద్దరూ ఉన్నటువంటి ఈ కాననం వారిద్దరి ఐక్య స్వరూపం. అటువంటి బృందావనానికి జయమగు గాక! రాధాకృష్ణులకు జయమగుగాక!

అటువంటి బృందావనంలో పండితులు, సర్వశాస్త్రవేత్తలు, యతీశ్వరులు, విశేషించి సామాన్యులు కూడా ఉన్నారు! ఆ శుద్ధమైన భక్తివల్ల అందరూ తరించారు!

## ఎనభై ఏళ్లనాటి కథ (20వ శతాబ్దం నాటిది) - విరహాసక్తి భక్తి యోగి

మదంటేర్ కి దగ్గర్లో ఒక కుటీరంలో ఉండేవాడు! ఇతడి భక్తి విరహాసక్తి! నిరంతరం రాధాకృష్ణ దర్శనం కోసం ఏడ్చేవాడు! నిత్యం విలపించేవాడు! అది రావాలంటే ఎన్నో జన్మల పుణ్యం ఉండాలి! ఏడవడమే దీక్షగా ఉన్నాడు! అప్రయత్నంగా వచ్చేది ఆనందాశ్రువులు! కొన్నాళ్ళకి చూపు సరిగ్గా ఉండేది కాదు! ఇతరులకు ఆ ఏడుపు కనపడకుండా పొదలమాటున ధ్యానం చేసుకునేవాడు! రోజంతా రాధాకృష్ణలీలలు మననం చేస్కుంటూ, రోజంతా బృందావన శోభను తలంచుకుంటూ, నామస్మరణ అవన్నీ చేస్కుంటూ, సాయంకాలానికి గోవింద్ జి మందిరం వద్ద ఆయనదగ్గర ఏడుపు నివేదించుకుని, కుటీరానికి వెళ్ళేటప్పుడు రెండు మూడు ఇళ్లలో మధుకరం తీస్కుని తిని, విశ్రాంతి తీస్కుని, మరలా మెలుకువ వస్తే అదే ఏడుపు! అతనికి తింటున్నా, తిరుగుతున్నా, ఒకటే భగవద్ వియోగ జ్వాల అతనిలో రగులుతూనే ఉన్నది! నారదుల వారు విరహాసక్తి చెప్పి ఆపేసారు! అది సర్వోత్కృష్టం! భగవద్ విరహం అంటే పరమాత్మయే కావాలి, ఆయన లేనిదే వ్యర్థం అనే తీవ్రమైన వేదన! భరింప లేని వేదన! అలా 80 ఏళ్ళు సాగింది దీక్ష!

ఒకమారు ఇద్దరు పిల్లలు వచ్చారు, ఒక పిల్లవాడు, ఒక పిల్ల వాళ్ళ పేర్లు శ్యామసుందర్, కిశోరీ. అందులో పిల్లవాడు అతని దగ్గరకి వచ్చి "తాతా నీ దుఃఖానికి కారణం ఏమిటి? ఎవరైనా కొట్టారా తిట్టారా?" అంటే విసుక్కున్నాడు అతను! మరలా ఆ అబ్బాయి నీకేమి కావాలో చెప్పు తెస్తాను అన్నారు, మజ్జిగ

తీసుకురానా? రొట్టె తీసుకురానా? నువ్వు ఏది అడిగినా తెస్తాను ఏడవకు" అంటూ అడిగాడు. అతను మరలా వెళ్ళమన్నానా వెళ్ళు నీతో నాకు పని లేదు అని విసుక్కున్నాడు!

శ్యామసుందర్ వెళ్లి కిశోరీతో అన్నాడు ఈ బాబా నా మాట వినడంలేదు నువ్వు వెళ్లి ఓదార్చు అన్నాడు! ఆ అమ్మాయి అన్నది "నీకు మాట్లాడడమే కానీ నవ్వించడం చేతరాదు! ఉండు నేను వెళ్లి నవ్విస్తాను" అని వెళ్లి తన ముద్దైన మాటలతో "ఎందుకు ఏడుస్తున్నావు నీ భార్య పోయిందా" అని అడిగింది.

పలుకు బట్టి ఆ పిల్ల ముఖం ఊహించుకుని నవ్వొచ్చింది అతనికి!

విరహయోగి: అమ్మా! నాకు బంధువులు మొదలైనవారెవ్వరూ లేరమ్మా

కిశోరీ: అయితే నీకు దుఃఖానికి కారణం ఏమిటి?

విరహయోగి: నీకు తెలియదులే అమ్మా!

కిశోరీ: చెప్పు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాము

విరహయోగి: ఎవరు నావారు అనుకున్నానో ఎవరు నా సర్వస్వం అని నమ్ముకుని ఇక్కడికి ఈ బృందావనానికి వచ్చి అంకితం అయ్యానో వాళ్ళు నన్ను పట్టించుకోవడంలేదు, నన్ను మర్చిపోయారు! ఈ వ్రజంలో ఒక్క మోసగాడు ఉన్నాడు ఆయన్నే వెతుకుతున్నాను! పోనీ ఆయన పట్టించుకోకపోతే ఆయనకు ప్రాణాధికా అయినటువంటి తల్లి రాధాదేవి అయినా అనుగ్రహిస్తుందేమో అనే నమ్మకంతో వారిని భజిస్తూ స్మరిస్తూ ముసలివాడిని అయ్యాను! ఒక్కసారి కూడా వారి దర్శనం నాకు కాలేదు! పైగా రాధాదేవి మృదుస్వభావి దయామయి తప్పక అనుగ్రహిస్తుంది అని అంటారు కానీ ఆ మోసగాడితో స్నేహంవల్ల ఆమె కూడా కఠినురాలైనది!

కిశోరీ వెంటనే "నేనా కఠినురాలిని" అన్నది మాటల్లో పడి, ఆ యోగి ఉలిక్కిపడ్డాడు, ఈవిడ వెంటనే నా పేరు కూడా రాధా లే అందుకే అలా అన్నాను తర్వాత కథ చెప్పు" అన్నది!

విరహయోగి: ఇంకేమిటమ్మా అదే నా కథ! వారిరువురూ ఒక్కసారి కనపడాలి అని కన్నీరు కారుస్తున్నాను, అలా కన్నీరు కార్చి కార్చి గుడ్డివాడిని కూడా అయిపోయాను!

కిశోరీ: అయితే నీకు కళ్ళు ఇస్తే సంతోషిస్తావా?

విరహయోగి: నాకు కళ్ళు లేవనే బాధే లేదమ్మా! వారిని చూడగల దృష్టి కావాలి కానీ ఈ కన్ను ఎందుకు?

కిశోరీ: కళ్ళు లేకపోతె వారు కనపడితే ఎలా చూస్తావు?

విరహయోగి: వాళ్ళు తలంచుకుంటే ఈ కళ్ళు లేకపోయినా చూడగలం కదా

బాబా అంటూ ఆ తల్లి తన రెండు చేతులను రెండూ కళ్ళమీద పెట్టింది! ఆ పిల్లవాడికి కూడా సైగ చేసింది. ఆయన కూడా వచ్చి చేయి వేసాడు! అలా వేయగానే ఎదురుగా ఒక మహాజ్యోతి దర్శనం అయింది, ఆ జ్యోతిలో రాధాకృష్ణయుగళం దర్శనం అవ్వగానే పరవశించి నామస్మరణతో మూర్ఛపోయాడు! అటు తర్వాత అతన్ని పట్టడం ఎవరి వల్లా కాలేదు! దర్శనం అయ్యేవరకు ఒకటి, ఒక్కసారి దర్శనం అయ్యాక ఆ వేదన మరింత పెరిగిపోయింది! ఎక్కడ పడితే అక్కడ దుర్భర విరహవేదనతో మూర్ఛపోతూ, విలపిస్తూ ఉన్నాడు! ఆ పై కొద్దికాలానికే భౌతిక దేహము వదిలి నిత్యరాసములోకి ప్రవేశించాడు! నిత్యరాసములోకి ప్రవేశించడమే రసయోగుల లక్ష్యం! అది పొందాడు ఆ మహానుభావుడు!

ప్రబోధానంద సరస్వతి అంటారు:
బృందావనం ఎటువంటి అద్భుతం అంటే అనిర్వచనీయం! త్రయీ వస్తువు అంటే వేదవిద్య మొత్తం శిరస్సు వంచి నమస్కరిస్తున్నది! గోకులపతి అయిన శ్రీకృష్ణపరమాత్మ అక్కడే సంచరిస్తూ ఉంటారు! ప్రేమరహస్యానికి అది మూలమా? మాధుర్య రసంలో చివరి అంచు రూపం ధరించి బృందావనంగా మారిందా? అంటున్నారు ప్రబోధానంద సరస్వతి.

## హితహరివంశీ మహారాజ్

వీరు ఒక అవతారం! ఎన్నో రచనలు చేసారు! "సేవక్ వాణి" అనే గ్రంథంలో ఒకాయన చెప్తారు హితహరివంశీ గురించి ఈ విధంగా, "ప్రపంచమంతా ధర్మరహితమవగా భూదేవి దుఃఖించింది. అటువంటి సమయంలో దయ కలిగిన రాధాకృష్ణులు శృతిపథం నుండి విముఖులైన వారిని ఉద్ధరించడానికి వేదసార స్వరూపంగా ఒకరిని అవతరింప చేసారు అతనే హితహరివంశీ"!
ఈయన శిష్యపరంపర నేటికీ ఎందరెందరో బృందావనంలో ఉన్నారు! వారి శిష్య పరంపర దేశమంతా వ్యాపించి ఉన్నది! బృందావన యోగులు, వారి ఆధీనంలో సాంప్రదాయబద్ధమైన మఠం ఉంటుంది! వారు రససిద్ధాంతం ప్రకారం జీవిస్తూ, శిష్యులకు చెప్తూ, సంచారం చేస్తూ కూడా రాధాకృష్ణ భక్తిని వ్యాప్తి చేసారు!
హితహరివంశీ అవతారపురుషుడు అని భక్తిసిద్ధాంతం తెలిసిన వారు అంగీకరిస్తారు! ఈయన కృష్ణమురళి యొక్క అవతారము అని కూడా అంటారు! ఈయన సహారన్ పూర్ సమీపంలో దేవవన్ అనే గ్రామంలో వ్యాసమిశ్రుడు అనే పండితుడు ఉండేవాడు! ఆయన జ్యోతిష శాస్త్ర పండితుడు! ఆయన రాజాస్థానంలో ఉండేవాడు! ఆ రాజుతో పాటు సంచరించేవారు! వ్యాసమిశ్రుడి భార్య తారారాణి గర్భవతిగా ఉండగా ప్రయాణమధ్యంలో బాద్ అనే ప్రాంతం వద్ద ప్రసవవేదన మొదలవగా వారు అక్కడ ఉండిపోయారు, 1502

సంవత్సరంలో ఆవిడ వైశాఖ శుద్ధ ఏకాదశి నాడు ప్రసవించింది. ఆ మహానుభావుడు ఉద్భవించాడు! శిశువు కలిగాక వారి గ్రామానికి వారు చేరుకున్నారు! ఇక్కడ ఈయన పుట్టిన సమయంలో పుట్టిన అబ్బాయి యొక్క మేనమామ నృసింహ లాల్ స్వామిజి తన ఇష్టదైవమైన నృసింహ స్వామిని ధ్యానిస్తున్న సమయంలో ఇక్కడ ఈ పిల్లవాడు పుట్టాడు! ధ్యానంలో శిశువు గోచరించాడు! అప్పుడు నృసింహస్వామినే అడిగాడు! ఆయన సాక్షాత్కరించి చెప్పారు, ఆ బిడ్డ నీ సోదరి బిడ్డ, ఆ పుట్టినది సాక్షాత్ కృష్ణపరమాత్మ యొక్క మురళి అని చెప్పారు! బయల్దేరి వెళ్ళాడు పిల్లవాడిని చూడడానికి! కొద్దిరోజులు అక్కడే ఉన్నాడు! ఉయ్యాల ఊపుతూ ఉంటే ఆశ్చర్యకరంగా నాదాలు వినిపిస్తూ ఉండేవి! నాదమే కదా వేణువు! దాని అవతారం ఉన్నప్పుడు నాదాలు వినపడతాయి కదా! వేదాలకు కూడా ఏ నాదం మూలమో, ఏది బ్రహ్మగాంధర్వమో ఆ వేణుశక్తి అతను! ఏ వేణువు రాధా అమ్మవారిని ఆవిడ మంత్రాన్ని ఉపాసిస్తూ ఉంటుందో! ఆ వేణువు!  కృష్ణ అధర రసాన్ని ఆస్వాదిస్తూ ఆయన దివ్యనాదలని వ్యక్తపరించింది, వేణువు రాధాదేవి ప్రియసఖి!

సఖీ భావ ఉపాసన సఖ్యాసక్తిలో భాగం, అది స్త్రీ పుం భావాలకు అతీతం! రాధాదేవికి పరిచర్య భాగ్యంగా కలిగిన దివ్యవేణువు అది!

మహాపండితుడు అయిన ఆ శిశువు మేనమామకి ఆ నాదాలు వినపడితే ఆయన చెవి వొగ్గి వినగానే అందులో అక్షరాలు కూడా వినపడ్డాయి! అలా 270 రోజులు 270 శ్లోకాలు వ్యక్తమయ్యాయి! ఆ గ్రంథమే రాధాసుధానిధి అనే గ్రంథం! రాధాతత్త్వం, రాధాకృష్ణలీలావిలాసం, బృందావన వైభవానికి పరాకాష్ఠకు చెందిన పరమ ప్రమాణమైన గ్రంథం!

అలౌకికమైన వాఙ్మయం అది! ఒక కవి, పండితుడు రాయలేడు! అత్యంత మధురంగా ఉన్నది! ఇది నేటికి కూడా లభ్యం అవుతున్నది!

నృసింహస్వామి ఆ శిశువు మేనమామకి చెప్పాడు అలౌకికమైన ఘట్టాలు కూడా చూస్తావు ఆ అబ్బాయ్ విషయంలో అని. ఒకమారు పిల్లలతో ఆడుకుంటూ ఈయన వెళ్లి కావాలని నూతిలో దూకి, అక్కడున్న కృష్ణవిగ్రహాన్ని పట్టుకుని పద్మాసనంలో తేలాడు!

ఆయన ఒకమారు 11 సంవత్సరాల అప్పుడు "నాయనా" అనే పిలుపు వినపడింది, కళ్ళు తెరచి చూస్తే, అఖండమైన జ్యోతిస్సుతో తల్లి రాధాదేవి సాక్షాత్కరించి నాయనా హితసఖి అని పిలిచింది! అతనికి పెట్టిన పేరు "శ్రీహితహరివంశి" అని. శ్రీహిత అంటే రాధాదేవికి అనుకూలంగా నడచుకునేవాడు! హరివంశీ అంటే కృష్ణమురళి!

రాధా అమ్మవారు అన్నది, "నేను ఒక లక్ష్యం కోసం లోకం లోకి పంపాను, అందుచేత మంత్రోపదేశం చేయబోతున్నాను" అన్నది! ఆయన అన్నాడు, "అమ్మా! నా నిండా నువ్వే నిండిపోయి ఉన్నావు, మంత్రమయివి, మరలా మంత్రోపదేశం ఏమిటమ్మా" అంటే, తల్లి అన్నది నీ ద్వారా విశేషమైన కార్యాలు

జరగాలని మా ఇద్దరి సంకల్పం అందుకే మంత్రం ఇస్తున్నాను అంటే, అనంతకోటిబ్రహ్మాండనాయకురాలివి నువ్వు అటువంటిది నువ్వు కదిలివచ్చి మంత్రం ఇవ్వడం ఏమిటి తల్లి, ఎందుకంత శ్రమ పడ్డావు అన్నాడు, తల్లి అంటున్నది, నాయనా నీకు ప్రత్యేకమైన గౌరవం ఇవ్వాలి, కృష్ణపరమాత్మ తన అధారాలనే సెజ్జె పై పెట్టి మన్నిస్తాడు కదా అందుకే నేనే వచ్చాను అని రాధాదేవి స్వయంగా రాధా మంత్రం ఉపదేశించింది! అటు తర్వాత ఆయన జీవితంలో అద్భుత పరిణామాలు! నిరంతరము రాధాకృష్ణ చింతనయే! ఆయన సన్యసించాలి అనుకున్నాడు, కానీ అమ్మవారి ఆజ్ఞ ప్రకారం గృహస్థాశ్రమం స్వీకరించాడు. ఆయన తల్లి తారారాణి 1589 లో, 90 లో తండ్రి స్వర్గస్థులయ్యారు!

1590 వ సంవత్సరంలో రసోపాసన కోసం వ్రజానికి బయల్దేరాడు! దారిలో వటవృక్షం కింద కూర్చున్నాడు, మాగన్ను గా నిద్రపట్టింది. రాధాదేవి దర్శనం ఇచ్చి "నాయనా నా స్వామి అయినటువంటి రాధావల్లభుడు ఇక్కడికి దగ్గర్లో ఉన్నాడు, ఆయన బృందావనం రావాలని తహతహలాడుతున్నాడు, నువ్వు ఆయన్ని ఇక్కడికి తీస్కొచ్చేయి" అన్నది. ఇదంతా అమ్మ లీల!

రాధవల్లభ స్వామిని అక్కడ ఒక కృష్ణభక్తుడు కొలుచుకుంటూ ఉన్నాడు! ఆయన ఆత్మదేవుడు, ఆయనకి ఇద్దరు పిల్లలు కృష్ణదాసి, మనోహరి, ఆ ఇద్దరు కన్యకలు కూడా స్వామిని కొలుచుకుంటారు! నువ్వు వాళ్ళిద్దరిని వివాహం చేస్కో! కట్నంగా ఆ రాధవల్లభ విగ్రహాన్ని అడుగు! అన్నది తల్లి!

అప్పుడు హితహరివంశీ అన్నారు, ఏమిటమ్మా మరలా ఈ సంసారమా అంటే, నాయనా ఇది రాధవల్లభ సంసారం నీది కాదు అన్నది! మీరంతా కలిసి ఆ రాధావల్లభుని సేవించాలి!

ఇక్కడ ఈయనకి కనపడినట్లే, ఆత్మదేవునికి కృష్ణపరమాత్మ దర్శనం ఇచ్చి ఇదే మాట చెప్పారు!

ఆ ఆత్మదేవుడు, హితహరివంశీ పరస్పరం స్వప్నములు చెప్పుకున్నారు! ఆ తర్వాత అమ్మవారు చెప్పినట్లే చేసి, తన ఇద్దరు పిల్లలని అతనికిచ్చి వివాహం చేసి, రాధవల్లభుని విగ్రహాన్ని అతని చేతులో పెడుతూ రాధే రాధే అని కుప్పకూలిపోయి సిద్ధిని పొందాడు!

హరివంశీ తన భార్యలతో, రాధావల్లభుని విగ్రహంతో పాటు బృందావనం చేరుకొని కృష్ణకీర్తన చేస్తూ ఉంటే అక్కడున్నవారంతా ఆకర్షితులై వచ్చేసారు (వేణువు యొక్క అవతారం కదా), అక్కడున్న అధిపతులు కూడా విల్లుబాణం ఇచ్చి, ఈ బాణం ప్రయోగించు, ఇది ఎక్కడ పడితే ఆ చోటు వరకు నీకు ఇచ్చేస్తాము అన్నారు. ఆయన ఆ బాణాన్ని వదిలితే అది "ఛీర్గాట్" అనే చోట పడింది! అక్కడే రాసమండలం నిర్మాణం చేసారు! ఇప్పటికి మహారాసం అని పిల్లలతో నృత్యం చేయిస్తారు! అవి గెంతులు కాదు దానికి ఒక పద్ధతి ఉన్నది, శాస్త్రం, ఉపాసన ఉన్నది! ఇప్పటికి రాసలీలలు అనేకం బృందావనంలో చేస్తూ ఉంటారు! అది ప్రారంభించింది హితహరివంశీ!

అంతేకాకుండా రాధవల్లభ మందిరం కూడా ఏర్పాటు అయింది! తర్వాత చరిత్రలో కొంతకాలానికి 1683లో సుందర దాస్ అనే ఢిల్లీ కి చెందిన పెద్దవ్యక్తి ఎర్రరాతి మందిరం నిర్మాణం చేసారు! 1726 వరకూ కూడా ఈ మందిరంలోని ఉన్నారు రాధవల్లభ స్వామి. 1726లో పరమపాపాత్ముడు అయిన ఔరంగజెబ్ దాడులు చేస్తూ వస్తూ ఉంటే, అక్కడ భక్తులు భయపడి రాధావల్లభుని కామ్యవనానికి తీస్కెళ్లి అక్కడ ప్రతిష్ఠించుకున్నారు. ఆ ఔరంగజెబ్ ఆలయాన్ని మాత్రం ధ్వంసం చేసాడు! రాధవల్లభుడు మాత్రం క్షేమంగా ఉన్నాడు! పాతమందిర సమీపంలో 1882 లో నిర్మించిన బృందావనంలో మందిరంలో ఉన్నాడు రాధావల్లభుడు!

బృందావనం అన్నీ వనాల్లో సాధన చేసాడు హితహరివంశీ! ఆయనవద్ద నేర్చుకోవలసినది భక్తి పద్ధతి! ఆయన శిష్యులకు కూడా ఇదే నేర్పాడు!

1) రాగద్వేషాలు ఉండరాదు, ప్రేమ ఉండాలి కానీ రాగద్వేషాలు ఉండరాదు! రాగద్వేషాలు ఉంటె ఈశ్వరుడికి దూరం అవుతాము!

2) వాదాలకు వెళ్ళరాదు! శాస్త్రబద్ధమైన సిద్ధాంతాన్ని కూడా ఎప్పుడూ అవమానించరాదు! ఏ జీవసంస్కారాన్ని బట్టి వారు ఆ యా సిద్ధాంతాలని పాటిస్తూ ఉంటారు! దేన్నీ కూడా అవమానించరాదు!

3) రాధా చరణోదకానికి ప్రాధాన్యం!

భావయోగము: వారికి విగ్రహం అవసరం లేదు, భావంతోనే భగవంతుని ఆరాధిస్తారు! వారికి భావసమాధిలో భగవంతుడు సాక్షాత్కరిస్తాడు! వారి భావము సాక్షాత్కరించిందా, లేదా సాక్షాత్కరించినది భావమైనదా? అంటే ఆ సమాధి స్థితిలో నిర్ణయించలేము! వారి భావము కూడా సత్యమే!

అది ఒక భ్రమతో కూడిన భావము ధరించినది అనడానికి లేదు! ఒక సంప్రదాయంతో, సాధనతో, యోగంతో పండిన భావం సత్యమై అనుభవానికి వస్తుంది! వారి సమాధి భావంలో పరమాత్మ అనేక లీలలు చూపిస్తారు! భక్తికి భావం చాలా ప్రధానం! అదే ఆ ప్రేమరూపమైన భావము మహాభావముగా పరిణమిస్తుంది, రససిద్ధిని అనుగ్రహిస్తుంది.

జ్ఞానానికి విచారణ ముఖ్యం!

భావము: ప్రతీవాడూ భావంతోనే బ్రతుకుతున్నాడు! జీవుడికి సంసారము ఏర్పడేదే భావంతోనే! వీడు నా వాడు వీడు పైవాడూ అంటూ! ప్రపంచం వైపు తిరుగుతున్నంత సేపు అసత్భావము, పరమాత్మ వైపు తిరగగానే సత్భావము! సత్ అంటే శాశ్వతం, పరమాత్మా! దాన్ని భావిస్తే సత్భావం!

వాళ్ళు పూజని పునస్కారాన్ని నిరసించరు, కానీ వారి పూజలు భావనతో ఉంటాయి!

పూజలు చేస్తూ పక్కన వాళ్ళని నానాతిట్లూ తిడుతూ ఉండేవారు ఉంటారు, అంటే వారికి దేవుడున్నాడు అనే భావమే లేదు! ఒక్కసారి భావంతో చేస్తే ఒక తాదాత్మ్యమైన భావం తప్పకుండా వస్తుంది!

మనిషి ఎక్కువగా యాంత్రికంగా భౌతికంగా అనుబంధం కలిగి ఉంటాడు కనుక శ్రద్ధ, భావన ఉండడం చాలా కష్టం! శాస్త్రము చెప్పిన ప్రకారం శ్రద్ధ కలిగి, భావన తోడైతే సిద్ధి పూజలోనే కలుగుతుంది!

ఒకసారి హితహరివంశీ భోగ్ తయారు చేస్తున్నాడట! ప్రేమ ఉండాలి, భావన ఉండాలి! ఆ యోగుల ప్రతీ చర్యలోను ఆ భావము, రసము కనపడుతుంది! ఆయన భోగ్ కలుపుతూ ఉండగా హరిరామ్ వ్యాస్ అనే పండితుడు అక్కడికి వచ్చాడు! ఈ పండితులు అనుకునేవారితో చాలా ఇబ్బంది. అద్వైతములము అనుకుని ప్రతీదాన్ని నిరసిస్తూ ఉంటారు! ! హితహరివంశీ ని ఓడిద్దాము అని వచ్చాడు! వచ్చి నాకు వాదభిక్ష పెట్టాలి అన్నాడుట! భోగ్ వండి పూజ అయ్యాక వచ్చి ఏమిటి సంగతి అని హితహరివంశీ అడిగారు! నేను ఇందాక చెప్పను కదా వినలేదా అన్నాడు పండితుడు! "భోగ్ వండేటప్పుడు మాట్లాడరాదు" అన్నారు హితహరివంశీ! నీతో వాదిస్తాను అని పండితుడు అడిగాడు, నీతో వాదించే అవసరము, ఓపిక, తీరికా మూడూ లేవు అన్నారు ఈయన. అంటే ఓడిపోయాను అని ఒప్పుకుంటావా అన్నాడు పండితుడు, అలాగే అని ఈయన ఒక పత్రం మీద సంతకం కూడా చేసారు! ఆ పత్రం తీసుకెళ్లి అందరికీ చూపిస్తూ వివిధ ప్రాంతాలు తిరుగుతూ ఉన్నాడు ఆ పండితుడు! హితహరివంశీ శిష్యపరంపర అప్పటికే వ్యాప్తి చెందినది కాబట్టి ఆ ప్రాంతంలో ఉన్న అతని శిష్యుడు ఏ ఈ పండితుడిని చూసి జరిగిన విషయం అతని ద్వారా తెలుసుకుని, తాను వాదించి ఆ పండితుడిని ఓడించాడు! వెంటనే ఆ పండితుడు సర్వం నీ గురువుకు సమర్పిస్తాను అంటే, ఈ శిష్యుడు అక్కడికి వెళ్లి సమర్పించుకో అన్నాడు!
పండితుడు వెళ్లి ఆయన వద్దకు వెళ్లి శరణాగతుడై క్షమించమని వేడుకున్నాడు! మీ పాండిత్యాన్ని అర్థం చెస్కోలేకపోయినందుకు క్షమించండి! భక్తులు అంటే భావవికారాలతో ఉన్నవారు అనుకున్నానే తప్ప పాండిత్యపుష్టిని అర్థం చెస్కోలేకపోయాను క్షమించండి అన్నాడు!
హితహరివంశీ జరిగినది తెలుసుకుని, తన శిష్యులని పిలిచి ఆ శిష్యుడిని ఇంకెప్పుడు ఇక్కడికి రానివ్వద్దు అన్నారు! వాదన కూడదు అనేది అతను పాటించలేదు! ఈ శిక్ష కఠినం అని కాదు కొంతమేరకు శిష్యులని నియంత్రిస్తూ ఉండేవారు!

హితహరివంశీ ఎందుకు వాదించలేదు?
వాదించలేక కాదు భక్తిమార్గంలో ఉన్నవారు వాదించకూడదు కనుక వాదించలేదు!
"వాదోనావలంబ్య:" అంటారు నారదులవారు భక్తిసూత్రాల్లో!
భక్తిసూత్రాలు దగ్గర పెట్టుకుని భక్తియోగుల జీవితాలు పరిశీలించాలి! సూత్రానికి తగ్గట్లు బ్రతకాలి!

మనం ఏ శాస్త్రం చదువుతామో ఏది కావాలి అనుకుని ఆ శాస్త్రాన్ని పట్టుకున్నామో దానికి తగ్గట్లు జీవిస్తున్నామా లేదా అని ప్రతీ క్షణం పరిశీలించుకోవాలి! అప్పుడు రాముడో, కృష్ణుడో, శివుడో అని మాట్లాడాలి! అప్పటివరకూ నటనలే, కాలక్షేపాలే! పట్టుకున్న శాస్త్రానికి తగ్గట్లు జీవించకపోతే ఎలా?

"తర్క: అప్రతిష్ఠ:" అంటున్నది వేదాంత శాస్త్రం!

"ఓ పండితుడా! ఎందుకయ్యా తర్కాలతో గిలగిలలాడతావు! ఆ శంకరుని పాదాలు పట్టుకుని తరించు అంటారు శంకరులు శివానందలహరిలో!

ఏకాదశి ఉపవాసం అనేది కృష్ణభక్తులకు చాలా ప్రధానం! ఒకరోజు ఆరుబయట ఉంటూ రెండూ చేతులూ దోయిలించి ధ్యానం చేస్తూ ఉండగా ఆకాశం నుండి రాధమ్మవారి తాంబూలం చేతిలో పడింది, అది అలౌకికమైన తాంబూలంగా తెలుస్తున్నది. ఆనందపరవశుడై స్వీకరించాడు, ఆయన ఎవరి దగ్గర దీక్ష తీసుకున్నాడో ఆయన వచ్చి ఏకాదశి నాడు ఏమీ స్వీకరించరాదు కదా అలాంటిది తాంబూలం స్వీకరించి మహాపాపం చేసావు అన్నారుట. అప్పుడు హితహరివంశీ అన్నారు, ఇది పాపం కాదు ఎందుకంటే సాక్షాత్తు తల్లి ప్రసాదం ఇచ్చినప్పుడు ఏకాదశి అని చూస్తారా అన్నారుట! ఒక దశ వచ్చేటప్పటికి సంప్రదాయాన్ని మించిపోతారు మహానుభావులు! అతిక్రమించారు అనరాదు, మించిపోయారు అనాలి! అంతేకాక వారు ప్రసాదాన్ని, తీర్థాన్ని ఎలా చూస్తారో తెలుసుకోవాలి! వారు భావంతో ఆరాధన చేస్తారు కనుక కృష్ణపరమాత్మ గ్రహిస్తారు, అటుపై వారు దాన్ని ఎంత భక్తిగానో పుచ్చుకునేవారు! అలా భావంతో చేసేవారి పూజలు ఎలా ఉంటాయో తెలుసుకోవాలి!

వారు అందించిన గ్రంథరాశిలో ప్రధానమైనది రాధాసుధానిధి!

<u>రాధాసుధానిధి</u>

- **ఏ తల్లి వస్త్రముల గాలికి కృష్ణపరమాత్మ తనని తాను మరచిపోతాడో, యోగులకు కూడా దుర్లభమైన మధుసూదనుడు ఏ తల్లి యొక్క వస్త్రముయొక్క కొసాగాలికి పరవశించిపోతాడో ఆ తల్లికి నమస్కారము! కృష్ణపరమాత్మ సకలయోగులచే సకలజనులచే నమస్కరింపబడేవాడు, అటువంటి వాడు రాధాధీనుడు, రాధమ్మవారు కృష్ణాధీన, వారిరువురూ ఒకరిపైన ఒకరు చూపించే ప్రేమ అటువంటిది. రాధకి కృష్ణుడు వశమవుతాడు కనుకనే రాధా భక్తులకు కృష్ణుడు వశమవుతాడు, అనగా భక్తికి భగవంతుడు వశమవుతాడు! కృష్ణపరమాత్మ ఆనందరసములో ఎప్పుడూ ఉంటాడు, అది గ్రహించవలసిన ఆంతర్యం!**

- బ్రహ్మరుద్రాదులు కూడా దర్శించలేని పరమాత్మని వశ్యం చేసుకున్న చూర్ణాన్ని తన పాదధూళి కణాల్లో దాచుకున్న రాధాదేవి చరణరేణువులకు నమస్కరిస్తున్నాను.
- రాధా అనే పేరు గల ఒక అలౌకికమైన నిధి ఉన్నది సుమా! అది పొందాలి అంటే, గొప్పగొప్పవి అని ఏ విషయాలు పట్టుకు తిరుగుతున్నావో, అవన్నీ విడిచి ప్రేమచిత్తంతో బృందావనాన్ని ఆశ్రయించు! అక్కడ సత్పురుషులని తరింపచేయడమే లక్ష్యంగా ఉన్నది, సుందరభావ సర్వస్వము, రససుధాపూర్ణం అయిన రాధా అనే నిధి బృందావనంలో ఉన్నది!
- ఆ తల్లి నేర్పరితనాల్లో సముద్రం వంటిది! అనురాగ రస ఏక సింధువు, భక్తులపట్ల వాత్సల్య సముద్రం, లావణ్య సముద్రం, లీలాసింధువు, అమృతకాంతులు వెదజల్లుతున్న తల్లి!
- రాధమ్మ విహరించే బృందావనంలో నా మనస్సు ఎల్లవేళలా విహరించుగాక!
- రాధాదేవి చేతిస్పర్శ కలిగి తరించిన పవిత్రమైన లతలు ఎక్కడున్నాయో, రాధాదేవి పాదస్పర్శచే మనోహరమైన స్థలములు ఎక్కడున్నాయో, రాధాదేవి వైభవాన్ని కీర్తించే పక్షులు ఎక్కడ ఉన్నాయో ఆ బృందావనంలో నా మనస్సు సంచరించు గాక!
- ఆ తల్లికి నేను కింకరి అయిపోవాలి! ఆవిడ పూర్ణానురాగరసమూర్తి, మెరుపుతీగల కాంతులతో ఉన్నటువంటుంది, భగవత్ తత్త్వపు రహస్యమైన ప్రేమజ్యోతి స్వరూపం ఈవిడ! వృషభానుని ఇంట్లో భక్తులని అనుగ్రహించడానికి అవతరించింది!
- ఏది బృందావనంలో మాత్రమే కనపడుతుందో అది రాధాదేవి! దేవతలు కానీ, శుకాది మహర్షులు కానీ ధ్యానములో పొందలేరు! నిత్యమూ కిశోర దశలో ఉన్న ఆ రూపాన్ని చూడడానికై నా కళ్ళు నిరంతరం అన్వేషిస్తున్నాయి!
- రాధా అనే రెండు అక్షరాలు మహామంత్రం! అది నీ ప్రాణశక్తిని ఉద్దీపనం చేస్తుంది, నీలోనే భావాన్ని ప్రజ్వలింప చేస్తుంది, నీ పాపరాశిని దగ్ధం చేస్తుంది! సామవేదం రసముట రాధాదేవి!
- రాధాసుధానిధిలో మణిద్వీపం లాంటి శ్లోకం: యమునానది తీరంలో ఒక కుంజములో కృష్ణపరమాత్మ యోగీంద్రుడివలె కూర్చుని రాధాదేవిని ధ్యానిస్తున్నాడు! ఆవిడ ఎవరు? తనకి అభిన్నురాలైన జ్యోతి! "రాధా" అంటూ నయనాశ్రువులు రాలుస్తూ అద్భుతమైన రసానందాన్ని అనుభవిస్తున్నాడు స్వామి! ఆ తల్లి యొక్క రెండక్షరాల పరావిద్య నా హృదయంలో స్ఫురించు గాక!

  *రాధా నామం కొంతకాలం సాధన చేసి చూడాలి హృదయంలో జరిగే మార్పులు!*
- రాధా అనబడే రెండు అక్షరాలు పరావిద్య! ఏ విద్య కేవలం బ్రహ్మానందం ప్రసాదిస్తుందో అది పరావిద్య!

- **యమునానదీ తీరంలో కల్పవృక్షం కింద రాధాదేవి విహరిస్తూ ఉంటుంది! ఆవిడ రాసక్రీడకి మూలమైన తల్లి! ఏకాంత గోపికలచే సేవింపబడుతూ ఉంటుంది! ఆ తల్లి దివ్యపాదములు మధురరసాన్ని వర్షించేవి! ఆ పాదములు కలిగిన నిత్యనూతనప్రేమ లక్ష్మి అయినా శ్రీరాధాదేవి నా మనస్సులో ప్రకాశించుగాక!**
- **రసానికి పరాకాష్ట అయిన గుప్తనిధి ఉన్నది! అది రాధాదేవి!**

**<u>విఠల దాస్</u>**

హితహరివంశీ శిష్యులలో ఒకాయన విఠల దాస్! ఈయన ఎప్పుడూ గురువు వద్ద ఉంటూ ఆయనకి సహకరిస్తూ ఉండేవారు! గొప్పజ్ఞాని, అనేక శాస్త్రాల్లో పండితుడు! ఈయన గురించి తెలుసుకున్న ఢిల్లీ చక్రవర్తి అప్పటికప్పుడు ఈయన్ని జునాగఢ్ ప్రాంతానికి ముఖ్యమంత్రిగా ప్రతిపాదిస్తూ ఫర్మానా పంపారు. విఠల దాస్ నేను మిమ్మల్ని, బృందావనాన్ని విడిచి వెళ్ళను అన్నారుట గురువులతో! హితహరివంశీ అన్నారుట ఇది రాధమ్మ లీల, నువ్వు వెళ్ళాలి అన్నారుట! మిమ్మల్ని, బృందావనాన్ని విడిచి వెళ్లడమా అంటే, హితహరివంశీ అన్నారు, "నువ్వు బృందావనం విడవవు, నిన్ను బృందావనం విడువదు, నిరంతరం నువ్వు సాధన చేయి! శ్యామాశ్యాములు నీలో వసిస్తారు! నువ్వు వెళ్ళాలి! కార్యభారం వహించాలి! నువ్వు వెళితే రాధారసతత్త్వం వ్యాప్తి చేస్తావు" అని!

ఎందుకు వ్యాప్తి చేయాలి? అంటే ఇది మతవ్యాప్తి కాదు!
1) వేణువ్యూహం 2) చక్రవ్యూహం అని రెండు ఉన్నాయి.
చక్రవ్యూహం దుష్టులని శిక్షించి ప్రతాపం చూపిస్తే, వేణువ్యూహం తన రసతత్త్వంలో దుష్టత్వాన్ని కూడా కరిగించగలదు. ఆ వేణువ్యూహమే హితహరివంశీ! అందులో భాగంగానే విఠల దాస్ తో చెప్తున్నారు "రాధాదేవి హ్లాదినీ శక్తి స్వరూపిణి, ఆ తల్లి యొక్క అనుగ్రహం చేత, ఆహ్లాద శక్తి ప్రభావంతో చక్కగా పాలన చేయి, నీకిచ్చిన మంత్రం ఉన్నది చక్కగా సాధన చేస్తూ ఉపాసన చేయి, నువ్వు ధ్యానిస్తూ ఉంటే నీ దగ్గరే ఉంటుంది బృందావనం అన్నారు!
అయితే విఠల దాస్ ఒక మాట తీసుకున్నారు! జునాగఢ్ అక్కడ దగ్గర్లో ప్రాంతమే, నాకు మీరు రోజూ స్వామి ప్రసాదం పంపాలి, అలా అయితే ఒప్పుకుంటాను అన్నారు, సరే పంపుతా అని మాట ఇచ్చారు హితహరివంశీ. ప్రతీరోజు గుర్రాల ద్వారా ప్రసాదం పంపేవారు.

**<u>భక్తుల పాలన ఎలా ఉంటుంది?</u>**

*మొత్తానికి ఈయన ఏలుబడిలో అద్భుత పాలన జరిగింది. కొందరు అనుకుంటూ ఉంటారు భక్తులు ఏమి చేయగలరు అని! కానీ భక్తులే ఏదయినా చేయగలరు ఎందుకంటే వారికి దేనిమీదా కూడా రాగద్వేషాలు, లోభమోహాలు ఉండవు, నీతి తప్పారు ఎందుకంటే భగవంతుడు ఉన్నాడన్న స్పృహ ఉన్న వాడు అధర్మం చేయలేడు, అందుచేత పాలకులు భక్తులైనా, భక్తులు పాలకులైనా బాగుంటుంది. భక్తులు అసమర్ధులు అనుకోవద్దు! తన హ్లాదినీ శక్తి ఉపాసనా ప్రభావం చేత ఆయన వివేకం, పరిపాలన దక్షత వెయ్యిరెట్లు అధికంగా పని చేసి ఆ రాజ్యమంతా ప్రశాంతత ఏర్పడి, ప్రజలు ఆనందంగా ఉన్నారు, ప్రకృతి సహకరించింది, ఎటువంటి వివాదాలూ లేవు, అంతర్యుద్ధాలూ లేవు!*

అటువంటి సమయంలో రాష్ట్రప్రధానన్యాయమూర్తికి అసూయ కలిగి, తనకంటూ ఒక వర్గాన్ని ఏర్పర్చుకుని ఇతడిని రాజద్రోహిగా చిత్రించి, లేనిపోని అభాండాలు వేసి ఒక నేరస్థుడిగా రాజుకి వార్త పంపారు, రాజు ఇతడిని బంధించి తీసుకువచ్చాడు. కొన్ని ప్రశ్నలు వేశారు, ఈయన తొణక్కుండా, బెణక్కుండా చెప్పినప్పటికీ కూడా తనకి అందిన లేనిపోని ఆధారాలని బట్టి ఆయన్ని చాలా అవమానంగా చూసారు! అతడిని శిక్షించాలి, అవమానించాలి అని వస్త్రహీనుడిని చేయండి అన్నారు! మీరేంటి చేసేది, నేనే తీసివేస్తాను అని ఆయనే తీసేసారట! అద్భుతం జరిగింది, ఆయన అణువణువునా, ప్రతీ రోమకూపంలో బృందావనం సాక్షాత్కరించింది! బృందావన ధ్యానం, ఆ రసం నిరంతరం ఆయన శరీరంలో ఉన్నాయి, హితహరివంశీ అనుగ్రహం వల్ల ప్రత్యక్షం అయింది. ఆ బృందావనం యమునానది స్నానఘట్టాలు, గోవర్ధనము, దివ్యమైన లతలు, పక్షుల కిలకిలారావాలు మొత్తం గోచరిస్తున్నాయి. ఆ అద్భుతం చూసి అక్కడున్నవారు ఎక్కడున్నారో కూడా మర్చిపోయారు. రోమరోమంలో బృందావనం, రోమరోమంలో కృష్ణతత్త్వం! ఇది సిద్ధావస్థలో తెలుస్తుంది, సామాన్యులకు అర్థం కాదు! మనసు, ప్రాణం, సకలం బృందావనం, ఆఖరికి ఉఛ్వాస, నిశ్వాసల్లో గజ్జలమ్రోతలు, యమునానదీ తరంగాల సవ్వడి ధ్వనులు వినబడ్డాయి! అందరూ లేచి నిలబడి ఆ పాదుషాతో సహా అందరు "జై శ్రీధామ్ బృందావన్" అని అరిచారుట! ఆ బృందావనాన్ని ఆ విధంగా గానం చేసారు! ఆ రాజు విఠల్ దాస్ ని క్షమించమని అడిగాడు. అప్పుడు కొందరు విశ్వసనీయులు వచ్చి ఇది కేవలం ఆరోపితమే కానీ వాస్తవం కాదు అని చెప్పగా రాజు క్షమించమని వేడుకుని ఇతన్ని తిరిగి రాజ్యపాలనకి పంపాడు!

విఠల్ దాస్ కి హితహరివంశీ చెప్పినది గుర్తుకు వచ్చింది, ఇది రాధాదేవి లీల అని చెప్పారు కదా! ఈ లీల జరిగిన తర్వాత ఎందరో కృష్ణభక్తులుగా మారారు! దుష్టత్త్వం అనే ప్రవృత్తి పోయింది. హితహరివంశీ తన ఉనికిచేతనే దుష్ట ఆలోచనలని (నెగటివ్ థాట్స్) తొలగించారు! విఠల్ దాస్ తిరిగి రాజ్యపాలన చేస్తున్నప్పటికీ

శత్రువుల బెడద వదలలేదు, ఒకసారి ఇంటిని కూడా తగలబెట్టారు, కానీ చిత్రం ఆ ఇంటిని అగ్నిదేవుడు ఏమీ చేయలేదు, సరికదా రాధాకృష్ణవైభవం కూడా ప్రత్యక్షం అయ్యింది. తర్వాత ఈ పని చేసినవారిని రాజు మరణదండన విధించబోగా, వద్దని వారించారు విఠల్ దాస్ జి.

ఒకసారి ఎప్పుడూ వచ్చే ప్రసాదం ఆనాడు రాలేదట, ఇంకా ప్రసాదం రాలేదేమిటా అని ఎదురు చూస్తూ ఉండగా భటులు ఖాళీ చేతులతో వచ్చి తలవంచుకుని ఉండగా "ఏమిటి ఇంకా ప్రసాదం రాలేదేమిటి, మా గురువుగారు ఎలా ఉన్నారు" అని అడగగా "మీ గురువులు సిద్ధి పొందారు, నిత్యరాసములో లీనమయ్యారు" అని ఆ భటులు చెప్పగానే, రెండూ చేతులు తలమీద పెట్టుకుని "హితహరివంశీ! రాధే! రాధే!" అంటూ నేలమీద పడిపోయారు, గురువు లేడనే విషయం తెలియగానే ప్రాణత్యాగం చేసారు! అలా సిద్ధిపొందారు!

**<u>హితహరివంశీ ప్రభావం - బందిపోటు నరవాహనుడి పరివర్తన</u>**

అప్పట్లో అక్కడ బందిపోట్లు ఉంటూ ఉండేవారు! ఆ బందిపోట్లకి నాయకుడిగా నరవాహనుడు అనే అతను ఉండేవాడు! అతడు పరమదుర్మార్గుడు! బృందావన పరిసర ప్రాంతాల్లో ఇళ్ల మీద పడి దోచుకుంటూ, బలవంతంగా కప్పాలు లాక్కుంటూ, ఎందరినో సంహరించి, ఎందరో స్త్రీలని వైధవ్యులని చేసి ఎంతో దోచుకున్నాడు! పరమ కిరాతకుడు! యమునానదికి ఆవల ఉంటూ ఉండే అతను ఒకమారు తన అనుచరులతో అంటున్నాడు, అవునూ అక్కడ ఎవరెవరో యోగులు ఉన్నారట సాధనలు అవి చేస్తూ ఉన్నారట అన్నాడు, అవునండి కొందరున్నారు అన్నారు ఆ అనుచరులు. ఆ యోగులవల్ల మనకేమీ ప్రమాదం లేదు కానీ కొందరు గూఢచారులను అక్కడికి పంపాము కదా వారి సంగతి ఏమైంది అని అడిగాడు నరవాహనుడు! వారు చెప్తున్నారు, అక్కడికి వెళ్లిన ఒక్కరు కూడా తిరిగి రావడంలేదు అని! వెళ్లిన గూఢచారులు వెళ్లిన ఆయనకి (హితహరివంశీ కి) భక్తులై వివిధ విధములుగా సేవించుకుంటున్నారు అని చెప్పారు. నరవాహనుడు అన్నాడుట, అతడి దగ్గర ఏవో వశీకరణ మంత్రాలు ఉన్నాయేమో, అయినా నన్నెవరు వశం చేసుకోగలరు, నేనే వెళతాను అంటూ తానే బంధించడానికి వెళ్తూ ఉండగా, త్రోవలో నాహర్ మల్ అనే ఆయన ఏడుస్తూ కనపడ్డాడుట! నరవాహనుడు అడిగాడట ఎందుకు ఏడుస్తున్నావు అని అడిగాడు, అతడు చెప్తున్నాడుట, "నేను హితహరివంశీ శిష్యుడను, ఆయన రాధాకృషులకు భోగ్ వండడానికి కట్టెలు ఏరడానికి వచ్చిన గురువుకి సహాయం చేస్తూ, మీరు కట్టెలు ఏరుతూ కష్టపడడం ఏమిటండి, ఎవరైనా పరిచారకుడిని పెట్టుకుందాం" అన్నాను పొరపాటున, అంటే ఆయన అన్నారు, "రాధాకృష్ణుల సేవ చేయడంలో ఉన్న ఆనందం నీకేమి తెలుసు,

పరిచారకులు కావాలా? ఇది ఒక పని అనుకున్నావా? ఈ మాట అన్నందుకు నిన్ను ఇక్కడే విడిచి వెళుతున్నాను" అని వెళ్లిపోయారు!

గురువు వెళ్ళిపోగానే ఏడుస్తున్నాడు! అది తెలుసుకుని ఇటువంటి భక్తి ఒకటి ఉంటుంది అని కూడా తెలియని నరవాహనుడు ఆశ్చర్యపోయాడు. మాట్లాడుతున్నవాడు హితహరివంశీ శిష్యుడు, గురువు మంత్రం ఇచ్చినప్పుడు ఆ మంత్రం యొక్క శక్తి శిష్యుడిలో ప్రకాశిస్తుంది, ఆ ప్రభావం చేత నరవాహనునిలో హఠాత్తుగా పరిణామం వచ్చింది. నేను నీ గురువుని చూస్తాను అని అడిగాడు నాహర్ మల్ తో కలిసి హితహరివంశీ వద్దకు వెళ్ళాడు. గురువు నాహర్ మల్ ని క్షమించరు. నరవాహనుడు హితహరివంశీని చూడగానే బోరుమంటూ ఏడ్చాడు!అంటే హృదయం కరిగిపోయింది, చూడగానే అంత దుర్మార్గుడైన నరవాహనుడికి కరిగిపోయి కన్నీళ్లు వచ్చాయి. హ్లాదినీ శక్తి రాధాదేవి ఉపాసన వల్ల తత్ శక్తి హితహరివంశీ ద్వారా తరంగాల రూపంలో అతను అంటున్నాడు, ఎన్నో పాపాలు చేశాను, నాకు నిష్కృతి ఏది? అని! అప్పుడు హితహరివంశీ "నీ పాపానికి ఎంత శక్తి ఉందో దాన్ని మించిన అనుగ్రహ శక్తి రాధాదేవి వద్ద ఉన్నది" అన్నారు. ఎటువంటి పాపిని అయినా అనుగ్రహిస్తుంది అమ్మ, అటువంటి దయామయురాలు. నీకు మంత్రాన్ని ఇస్తున్నాను, నువ్వు ఈ వృక్షం క్రింద సాధన చేయమన్నారు, అలాగే చేసి సిద్ధిని పొందాడు నరవాహనుడు! అలా దుష్టుల్లో కూడా పరివర్తన తీసుకువచ్చిన మహానుభావుడు. అది దివ్యమైనటువంటి రాధాదేవి ప్రభావం! ఇలా ఎందరిలోనో పరివర్తన కలిగించి ఎందరిలోనో ఆ భక్తిసిద్ధాంతాన్ని వ్యాపింప చేసారు.

హితహరివంశీ హితచౌరాసి అనే గ్రంథాన్ని కూడా రచించారు, 84 గేయాలతో ఉన్నటువంటి వ్రజహిందీలోని రచన. అలాగే "స్ఫుటవాణి" అని మరో గ్రంథం! ఇవి రాధాకృష్ణ భక్తులు ప్రమాణంగా అధ్యయనం చేస్తుంటారు. ఈయన 106 ఏళ్ళు జీవించి కాయవరోహణతో (శరీరం దొరకకుండా సూక్ష్మ అణువులుగా మారి సిద్ధిని పొందడం) సిద్ధిని పొందారు.

**సేవక్ జి, చతుర్భుజదాస్ జి - తనువు చాలించినా మంత్రాన్ని ఉపదేశించిన హితహరివంశీ**

జబల్ పూర్ ప్రాంతం వద్ద సేవక్ జి, చతుర్భుజదాస్ జి అని ఇద్దరు ఉండేవారు, వీరిద్దరూ హితహరివంశీ గ్రంథాలని అధ్యయనం చేసి, ప్రభావితులై ఎలాగైనా ఆయన వద్ద దీక్ష పొందాలని బృందావనం వచ్చేటప్పటికి ఆయన సిద్ధిని పొందారని తెలుసుకుని చాలా బాధ పడ్డారు. ఆ సమయంలో ఒకాయన చెప్పారట హితహరివంశీ కొడుకు ఆచార్యవనచంద్రజి అని ఉన్నారు అని ఆయన వద్ద దీక్ష తీసుకోవచ్చు అని, ఆయన (ఆచార్యవనచంద్రజి) కూడా మహానుభావుడు. చతుర్భుజదాస్ జి వెళ్లి ఆయన వద్ద మంత్రాన్ని పొందారు కానీ సేవక్ జి మాత్రం నేను హితహరివంశీ ని మాత్రమే గురువుగా స్వీకరించాను, ఆయన లేకపోతె రాధానామస్మరణ చేస్తూ ప్రాణాలైనా విడుస్తాను కానీ మరొకరిని గురువుగా భావించలేను అన్నారు. వంచంద్రజి, చతుర్భుజదాస్ జి

కి మంత్రం ఇచ్చి, మనిద్దరం వెళ్లి సేవక్ జి ని చూద్దాము అని వెళ్లారట, వెళ్ళేటప్పటికల్లా నాకు ఉపదేశం అయిందన్నారుట సేవక్ జి, ఏ మంత్రం ఇచ్చారు అంటే, గురువుగారి పుత్రునివి కాబట్టి నీకు చెప్పవచ్చు అని చెప్పారట, సరిగ్గా వంచంద్రజి చతుర్భుజదాస్ జి కి ఇచ్చారో, అదే మంత్రం సేవక్ జి కి ధ్యానంలో హితహరివంశీ ప్రత్యక్షమై ఇచ్చారట.

సిద్ధపురుషులు తనువు చాలించినా వారు శాశ్వతమైన రాధాకృష్ణతత్త్వంలో లీనమై ఉంటారు కావున స్మరించిన వారిని అనుగ్రహిస్తారు.

హితహరివంశీ రచించిన హితాచౌరాసి పుస్తకానికి సేవక్ జి "సేవక్ వాణి" అద్భుత వ్యాఖ్యానాన్ని రచించారు.

ఇటువంటి మహాయోగుల చరిత్రలెందరివో మనకి అందించినవారు మహాత్ములైన బృందావనయోగులు. వారే వీటిని సేకరించి అందించారు.

## రాధికాప్రసాద్ జి మహారాజ్

తెలుగునాట రాధాకృష్ణతత్త్వాన్ని వ్యాప్తి చేసిన మహానుభావుడు 1901 లో పుట్టి 2003 లో తనువు చాలించిన మహానుభావుడు శ్రీరాళ్లబండివీరభద్రరావు గారు. ఈయన గోదావరి జిల్లా ప్రాంతంలో పుట్టినప్పటికీ విద్యరీత్యా వంగదేశంలో కొంతకాలం ఉన్నారు. కలకత్తాలో అనేక యోగుల కోసం అన్వేషిస్తూ ఎందరినో చూసారు, ఎందరితోనో మాట్లాడారు. ఈయన జ్యోతిష్య శాస్త్రములో పండితుడు, ఆ శాస్త్రంలో గ్రంథాన్ని కూడా రచించారు. ఈయనకు హుబ్లీ లో సిద్ధరూఢ స్వామి అనే సిద్ధపురుషుడు కనపడ్డాడు (ఈయన ఆశ్రమం ముందర పెద్దపులి దాని మీదనుండి ఆడుకుంటున్న కుందేళ్లు కనపడ్డాయట)! సాక్షాత్తు శివస్వరూపం అనిపించే సిద్ధపురుషుడు! అటువంటి ఆయన శ్రీరాళ్లబండివీరభద్రరావుగారికి శివపంచాక్షరీ అనుగ్రహించాడు. అటు తర్వాత కేరళ వద్ద కాల్వే ప్రాంతంలో ఒక సిద్ధపురుషుడు దేవీమంత్రాన్ని ఉపదేశించాడు. మంత్రాన్ని పుచ్చుకున్నాక క్షేత్రానికి వెళ్లి దీక్షగా సాధన చేయాలని వెళ్లి కొంతకాలం జపం చేయగా జ్ఞానప్రసూనాంబిక అనుగ్రహించి సాక్షాత్కరించింది. అమ్మవారు నీకు ఇంకేమైనా కోరిక ఉందా అంటే మా ఆవిడకి కూడా కనపడమ్మా అని అడిగారట, ఆవిడకి కనిపించే నీవద్దకు వచ్చానన్నారు అమ్మవారు.

శ్రీరాళ్లబండివీరభద్రరావు గారు గృహస్థుగా ఉంటూనే సన్యాసిలా ఉన్నారు. ఉన్నత ఉద్యోగం చేస్తూనే సాధన చేసారు. అటుపై అనంతపురంలో యోగులద్వారా కామగాయత్రి మంత్రాన్ని పొంది సిద్ధిని పొందారు. ఈయనకి 48 ఏళ్ల వయస్సులో అంటే సుమారు 1947 ప్రాంతంలో సూక్ష్మభూమికలో సాక్షాత్తు విజయవాడ కనకదుర్గమ్మ

కనపడి సాక్షాత్తు రాధా మంత్రాన్ని ఉపదేశించి, ఇంద్రకీలాద్రిపై సాధన చేయమన్నది. ఆయన కొంతకాలం సాధన చేసి రాధామంత్రాన్ని సిద్ధిపొందారు. రాధాదేవి సాక్షాత్కరించింది. రాధాదేవి అనుగ్రహం చేత అనేకమంది దేవతలు, సూక్ష్మభూమికలు దర్శనం ఇచ్చాయి. శరీరం ఉన్నన్ని రోజులూ సూక్ష్మ ప్రపంచం గురించి చెప్తే అర్థం కాకపోగా మనం చూసేదే సత్యం అనుకుంటాము. కానీ శరీరం పోయాక, చేసిన కర్మలని పట్టి రకరకాల గతులు ఉంటాయి. కనుక పాపకర్మలు చేసి సూక్ష్మ భూమికలో గతులు లేక తిరుగుతున్నవారెందరో ఈయనకి కనపడగా మంత్రశక్తితో వారిని శుద్ధిని చేసి సద్గతులు ఇచ్చారు. అంతేకాక తన మంత్రశక్తితో ఎందరో ఆర్తులని ఆదుకున్నారు. అలాగని డాంబికాలకు పోలేదు, ఎందరో ఆర్తులను ఆదుకున్నారు, అమ్మవారు ఆయనపై ఆ బాధ్యతను పెట్టారు. ఆయన్ని దర్శనం చేసుకున్న, ఆయన చేతిస్పర్శ పొందినా, ఆయన చేత్తో తీర్థం పొందినా రోగాలు, దుష్టశక్తులు పోతాయన్న ప్రతీతి ఏర్పడింది. ఆయనప్పుడు గుంటూరు ప్రాంతంలో కొంతకాలం ఉద్యోగం చేసారు. అదే సమయంలో గుంటూరులోనే శ్రీమతి చైను హనుమాయమ్మగారని ఉండేవారు, ఆవిడకి కూడా కనకదుర్గా దేవి రాధామంత్రాన్ని ఉపదేశించిందట. ఆవిడకు రాధామహాలక్ష్మి అని కూడా పేరు మంత్రం వల్ల. ఈవిడ, వీరి భర్త అయిన హరికోటినారాయణ గారు ఇద్దరికీ కూడా శ్రీరాళ్లబండివీరభద్రరావు గారిపై మంచి ప్రతిపత్తి ఏర్పడి, వారంతా మంచిమిత్రులై రాధాకృష్ణతత్త్వాన్ని వివిధ గ్రంథాల ద్వారా, వివిధ బోధల ద్వారా వ్యాప్తి చేస్తూ ఉన్నారు.

1957 లో బృందావనం వెళ్ళిపోదాం అనే కోరిక కలిగినప్పుడు, రాధాదేవి ప్రేరణ చేత వారు గుంటూరులోనే రాధాకృష్ణ మందిరాన్ని ఏర్పాటు చేసారు, దాన్ని ఆధారం చేస్కుని ఎందరినో రక్షించారు. వారి తపశ్శక్తి అక్కడ ప్రోది అయి ఉన్నది. వారు సరళమైనటువంటి హృదయ సంస్కారంతో ఎందరినో ధార్మికం వైపు తిప్పారు, ఎందరినో భక్తులుగా మార్చారు, దుష్టప్రవృత్తులను పోగొట్టారు! ఆర్తుల పీడలను తొలగించారు మహానుభావులు. బోధకుడిగా, రక్షకుడిగా, పెద్దదిక్కుగా నిలబడ్డారు. అటువంటి ఆయన సుమారు తనకి 80 ఏళ్ళు దాటిన తర్వాత బృందావనం చేరారు, అక్కడ నుండి సంవత్సరంలో 8 నెలలు బృందావనంలో ఉంటూ మిగిలిన నెలలు దక్షిణానికి వచ్చి రాధాకృష్ణతత్త్వ ప్రసారం చేసారు. బృందావనంలో దివ్య ఆశ్రమ స్థాపన చేసారు, నేటికీ కూడా ప్రకాశిస్తూ ఉన్నది. అది రాధామహాలక్ష్మి మందిరంగా ప్రసిద్ధి చెంది ఉన్నది, ఆయన శిష్యురాలైన అంజనాదేవి మాతాజీగా కొలవబడుతూ ఉన్నది!

అక్కడున్న బృందావన యోగులందరు ఈయనని మహాయోగిగా ఆదరించారు. ఈ మహానుభావుడు బృందావన యోగుల గురించి విస్తారమైన సంపుటాలుగా గ్రంథాలు రచించారు. రాధాకృష్ణులు, వారి ఉపాసనా విధానం, బృందావన యోగులు, ఇదంతా ఒక శాస్త్రంగా ఏర్పరిచి అందించిన మహానుభావులు! ఆ మహానుభావుడు గుంటూరులో ఉంటూ ఉన్నప్పుడే ఈ దేహాన్ని త్యజించి, తన దివ్యదేహంతో నిత్యరాసధామంలో ప్రవేశించారు! ఈయన్ని "నాన్నగారు" అని కూడా భక్తులు పిలుచుకుంటారు.

**శంతను బీహార్ జి (అఖండానంద సరస్వతీ మహారాజ్)**

గొప్ప అద్వైత పండితుడు, గొప్ప జ్ఞాని. వారణాసి అతిదగ్గర్లో ఉన్న ఒక పల్లెలో జన్మించారు. ఆయన పేరు శంతను బీహార్ జి. 1911లో జన్మించారు. పండిత కుటుంబం. భాగవతం వారి కుటుంబానికి చాలా ప్రధానమైన గ్రంథం. ఆయన వారణాసిలో అనేక శాస్త్రాలని అధ్యయనం చేసారు! అనేకమంది పండితులతో సంభాషణ చేసారు. గొప్ప శాస్త్రవేత్త, అయినప్పటికీ గొప్పభక్తుడు! ఆయన యోగానంద్ జి (రామకృష్ణపరమహంస ప్రశిష్యులు) అనే ఆయన ద్వారా కృష్ణమంత్రాన్ని పొందారు. ఆయన గురువును నాకేదయినా మంత్రసిద్ధిని ఇవ్వండి అని అడిగితే గురువు ఒక మాట చెప్పారట, నాయనా నువ్వు వేదాంత విద్యని పొందడానికి ఎవరి దగ్గరికి అయినా వెళ్లరాదా అంటే, శంతను బీహార్ జి తులసీదాస్ చెప్పిన ఒక మాటని ఉటంకిస్తూ అంటారు, "కళ్ళనిండా రాములవారిని చూడాలి, ఆ తర్వాతే ఏ వేదాంత విద్య అయినా" అన్నారట! అదే విధంగా ఆ పరమాత్మ దివ్యమంగళవిగ్రహాన్ని చూడాలి అంటే, గురువు అన్నారు, ఇస్తాను కానీ కొంతకాలము సాధన చేయి అని! ఆయన ఆ తర్వాత 24 లక్షల గాయత్రిని పురశ్చరణ చేసిన తర్వాత కృష్ణమంత్రాన్ని ఉపదేశించారు యోగానంద!

అది జపిస్తున్న కాలంలో అక్కడ ఉడియా బాబా అని ఒకాయన ఉండేవారట. ఆయన అవధూత, సిద్ధపురుషుడు! అప్పుడు శంతను బీహార్ జి కి వెళ్లాలనిపించిందిట ఆయన దగ్గరికి! అప్పుడు గురువు ఒక మాట చెప్పారు, ఇది సాధకులంతా తెలుసుకోవాలి, అదేమిటి అంటే, "నువ్వు జపం చేయి నాయనా! జపకాలంలో నువ్వు భక్తితో సగుణకృష్ణమూర్తిని ధ్యానిస్తూ జపం చేయాలి! ఇప్పుడు నువ్వు సగుణము, నిర్గుణము అంటూ వేదాంతము మాట్లాడేవారిని వెళ్లి కలుస్తాను అన్నావనుకో నీ సాధనపై శ్రద్ధ తగ్గుతుంది, ఒక అయోమయం ఏర్పడుతుంది! ఇది బాగా తెలుసుకోవాలి! కొందరు భక్తితో జపం చేస్తూ మధ్యలో వేదాంత చర్చలకు పోయి, అది సత్యమా, ఇది సత్యమా అంటూ డోలాందోళనలో పడి వారి సాధన సరిగా సాగదు. సాధనదశలో జాగ్రత్తపడాలి, ఒకసారి సిద్ధి పొందాక సందిగ్ధంలో పడరు! సిద్ధి పొందిన వేదాంతి, సిద్ధి పొందిన భక్తుడు వీరిద్దరికీ అయోమయం ఉండదు.

***కృష్ణదర్శనం***

శంతను బీహార్ జి గురువుమాట విని సాధన చేసాడు, అలా చేస్తూ గంగాతీరంలో ఒకమారు అనుకుంటాడు, ఇంత జపం చేసినా నాకేమీ అనుభూతులు కలగలేదే అని బాధపడుతున్న సమయంలో ఒక వింత జరిగింది. జపమాల ఒడ్డున పెట్టుకుని సాధన చేస్తూ ఉంటే జపమాల ఒక పక్షి ఎత్తుకుపోయింది. దానితో నా జపం వృధా అని బాధపడుతూ కుటీరానికి వెళ్లి కూర్చున్నాడు. ఒక్కసారిగా అద్భుతం జరిగింది. ఒక్కసారిగా ఆ పైభాగంలో ఒక దివ్యదర్శనం ఏర్పడింది. అది తప్ప మరేదీ కనపడని ఒక మహాజ్యోతి. ఆ జ్యోతిస్వరూపంలో శరీరంపై వస్త్రము లేకుండా అన్నీ పూలమాలలతో ఉన్న ఒక చిన్నపిల్లవాడు కనపడ్డాడు. ఆ చిన్నపిల్లవాడు

అద్భుతకరుణామయ నేత్రాలతో, మందహాసవదనంతో ఉన్నాడు. కిరీటం కూడా పువ్వులతోనే ఉన్నది, పువ్వులే వస్త్రముగా, పువ్వులే ఆభరణములుగా ఉన్నాడు. చిరునవ్వు నవ్వుతున్నాడు! ఇది భ్రమ కాదని తెలిసే అంతవరకూ కనపడుతూనే ఉన్నాడు! ఆయనకు ఒక్కసారి సాష్టాంగ నమస్కారము చేయాలనిపించిందిట కానీ శరీరం కదలని స్థితిలో ఉన్నది! శిరస్సు వంచుదాం అంటే వంగడంలేదు, చేతులు జోడించబడలేదు, మాట పెగలడంలేదు, చూస్తూ ఉన్నాడు!

***ఆ బాలకృష్ణమూర్తి ఈ విధంగా అన్నాడు: "అన్నీ నేనే, నేనే అన్నీ! ఈ జగత్తు ఏదయితే కనపడుతోందో అదంతా నేనే! నేను నువ్వు వేరు కాదు ఒక్కటే! నువ్వే నేను, నువ్వే నేను! మనకెప్పుడూ వియోగమూ లేదు సంయోగము లేదు! ఎప్పుడూ నిత్యమూ ఉన్నది కలయిక మాత్రమే" అని చెప్పి అంతర్ధానం అయ్యాడు!***

ఏ పరమాత్మని సగుణం అని ఉపాసిస్తున్నామో, ఆయన నిర్గుణం అనే జ్ఞానం ఆయనే ఇస్తాడు అనే అనుభూతి కలిగింది ఆయనకి!

ఈయన రచించిన వ్యాసంలో అంటారు "సంసారబంధం నుండి మనం ముక్తులమే, అది తెలియడం కోసం భగవంతుని కోసం జపం చేయాలి"! కృష్ణ ఉచ్చారణతోనే కృష్ణప్రాప్తి" అనే వ్యాసం రాసారు! అప్పట్లో గీతాప్రెస్ సంపాదక వర్గంలో కూడా కొంతకాలం పని చేసారు.

శాస్త్రవేత్త కనుక ప్రస్థానత్రయభాష్యం క్షుణ్ణంగా చదువుకున్నారు. అద్వైతంలో మహాపండితుడు. ఆ సమయంలో ఈయన మాండూక్య, ఇతర ఉపనిషత్తుల కారికల గురించి ప్రవచనం చేస్తే ఆశ్చర్యంగా వినేవారు ఇతర పండితులు! అవిద్యా గ్రంథి ఈయన ప్రవచనం వింటే ఊడిపోతుంది అనేవారట, అలా వేదాంత భాష్యము చెప్పేవారు! అదే విధంగా భాగవతం చెప్పేటప్పుడు ఆ రాధాకృష్ణతత్త్వంలో రసమయంగా లీనమవుతూ చెప్పేవారు. అప్పుడు అనేకమంది సన్యాసులు, యోగులు అది వింటూ కళ్ళనీరు కార్చేవారు. ఆ విధంగా ఈయన అద్వైత జ్ఞానాన్ని, భాగవత రసాన్ని కూడా వ్యాప్తి చేసిన మహానుభావుడు. ఈయన బృందావనంలోనే తనువును చాలించారు! భారతదేశంలో అనేకయోగులతో సత్సాంగత్యం చేసి, అనేకగ్రంథాలు కూడా రచించారు. ఆయన మాటలు చాలా విశేషం!

(వ్యక్తిగతంగా వారి గ్రంథాలు చదువుతూ, వారి ప్రభావం తనపై ఉందంటూ,  వారిని గురువుగా స్వీకరిస్తారన్నారు మన పూజ్యగురువులు)!

వారు సన్యాస ఆశ్రమం స్వీకరించాక శంతను బీహార్ జి పేరు అఖండానంద సరస్వతీ మహారాజ్! ఈయన బృందావనంలో "ఆనందబృందావన్" అనే ఒక విశాలమైన ధామం ఏర్పాటు చేసారు! అక్కడ నృత్యం చేస్తున్న అద్భుత కృష్ణపరమాత్మ మందిరం ఉంటుంది. అదే విధంగా రాధాకృష్ణ మందిరం, భావేశ్వర శివమందిరం ఉంటుంది! అక్కడ వేదపాఠశాల, గోశాల కూడా నిర్వహింపబడుతున్నాయి. ఆదిశంకర పరంపరకు సంబంధించిన సన్యాసాశ్రమ స్వీకారం చేసారు జ్యోతిష్పీఠం ద్వారా. అద్వైత సంప్రదాయాన్ని అనుసరించిన

కృష్ణభక్తుడు, మహాసిద్ధపురుషుడు. బృందావనంలోనే 76 ఏళ్ళకి సిద్ధిపొందారు! ఆయన ద్వారా సిద్ధిపొందినవారెందరో! ఆయన మిత్రులు కూడా మహామహాయోగీశ్వరులు.

ఎందరెందరో మహాత్ములైన బృందావన యోగులలో కొందరివి తెలుసుకున్నాము. ఇందులో ఒక్కరి చరిత్ర క్షుణ్ణంగా అర్థం చేసుకున్నా చాలు!

*"కృష్ణం సమారాధ ఇతి రాధా కృష్ణేణ ఆరాధ్యతే ఇతి రాధా"*
*కృష్ణుని ఆరాధించునది, కృష్ణునిచేత ఆరాధింపబడునది అయినటువంటి ఆ రాధాదేవి, ఆ రాధాదేవికి అభిన్నము అయినటువంటి కృష్ణస్వామి, ఆ రాధాకృష్ణ రసమయతత్త్వాన్ని ఉపాసనతో, పవిత్రమైన జీవనసరళితో సిద్ధిగా పొందడమే కాకుండా ఎందరినో తరింపచేసారు, ఎందరిలోనో దుర్భావాలని తొలగించారు. కనుక రాధాకృష్ణతత్త్వాన్ని అనుసంధానం చేసుకుంటే ఆ హ్లాదినీ శక్తియొక్క ప్రభావం చేత మనలో దుర్భావాలు తొలగి సద్భావాలు పెంపొందుతాయి. అటువంటి రాధాకృష్ణ అనుగ్రహం సమస్తమునకూ లభించుగాక! ప్రత్యేకించి భారతదేశం మరియు సనాతనధర్మానికి రాధాకృష్ణ కృప లభించుగాక!*

# సర్వం శ్రీగురుచరణారవిందార్పణమస్తు